# వెయ్యి భాషల న్యూగినీ

శాంతి మహాసాగరంలో సాలమన్ దీవుల ప్రాంతంలో బోగైన్ విల్లే అని ఒక దీవి ఉంది. బోగైన్ విల్లా అనే మాటకు, ఇప్పటి వరకు మనకు తెలిసిన అర్థం కాగితం పూలు లేదా బోగం మల్లె అని. అవి అంతగా ఆకర్షణ లేని పూలరకం. అవి బహుశ ఆ ద్వీపంలోనుంచే వచ్చాయేమో!



మొత్తానికి అదొక చిన్న దీవి. అయినా అక్కడ మొత్తం 18 భాషలు మాట్లాడతారు. అందులో ఒకటి రొటోకాస్. దాన్ని మాట్లాడే వాళ్లు మొత్తం నాలుగువేల మంది ఉండేవారు. ఇప్పటికి బాగా తగ్గిపోయారు. విచిత్రమేమిటంటే రొటోకాస్ భాషలో మొత్తం హల్లులు ఆరు మాత్రమే. ఆ భాషలో రకరకాల పక్షుల పేర్లు గమనిస్తే, అర్థం అవుతుంది. కొపిపి, కురుపి, వొకుపి, కొపికా, కొరొరో, కెరావో, కురుయే, ఇలా ఉంటాయి అక్కడి పక్షుల పేర్లు. ఎన్నిసార్లు చెప్పినా క, ప, ర, వ కంటే మరో హల్లు చప్పుడు వినిపించదు. ఇంత విచిత్రమయిన భాష మొత్తానికి అంతమయి పోతున్నదట. అదీ అసలు సంగతి!

కొంతకాలం నుంచి జీవశాస్త్రవేత్తలు, వన్యప్రాణి రక్షకులు మొదలయినవారు, అంతరించి పోతున్న జంతు వృక్షాల గురించి పరిశీలనలు, పరిశోధనలు చేస్తున్నారు. పోయినవి పోగా, కొంత మిగిలిన వాటిని కాపాడుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదే సంగతి, భాషల విషయంలోనూ జరగాలని ఇంకా చాలా మందికి అర్థమయినట్లు లేదు. మనదేశం అందమయిన నందనవనమని పాటలు పాడుకుని దేశంలోని భిన్నత్వం,ఏకత్వాల గురించి గుర్తు చేసుకుంటాం. ఈ దేశంలో రూపాయినోట్ల మీద ఎక్కిన భాషలు కొన్నే అయినా, ఇంకా మనుషుల నోళ్లలో నిలిచిన భాషలు మాత్రం 800 పైచిలుకుగా ఉన్నాయంటారు.

మన భాషల్లో హల్లులు కొల్లలుగా ఉన్నాయి. మిగతా భాషలవారికి పలకడం చేతగాని ధ్వనులు కూడా కొన్ని ఉన్నాయి. రొటోకాస్ వాళ్లకు ఉండే ఆరు హల్లుల్లో 'క' ఉంది. నయం. మన తెలుగులో 'ఖ' కూడా ఉంది. నిజానికి 'ఖ' పలకవలసిన పదాలన్నీ సంస్కృతం నుంచి వచ్చినవే అయి ఉంటాయి. ఉర్దూలో 'ఖ' మీద చుక్క పెట్టి పలకవలసిన అక్షరాలు రెండున్నాయి. ఒకటి వాడి 'ఖబర్' అంటే వార్తలు. రెండోది, నాలుకను కిందనే వెనక్కు పట్టి, గాలి ఊదకుండా పలకాలి. అది 'ఖ'కు 'క'కు మధ్యన వస్తుంది. ఆ 'కబర్' కు అర్థం 'సమాధి' అని. సులభంగా అర్థం కావాలంటే 'గోరీ.'

తమిళంలో క, ఖ, గ, ఘ లకు అన్నింటికి కలిపి ఒకటే అక్షరం. అందుకనే ఆ నాలుగింటిని మార్చి మార్చి వాడుకుని అందరినీ తికమక పెడుతుంటారు. "గురులేక ఎటువంటి గుణికి తెలియకపోదు" అని ఒక త్యాగరాజ కీర్తన ఉంది. మదురై సోము అనే మధుర గాయకుడు తెలుగు తెలిసి ఉండి కూడా "కురులేక" అని పాడేవారు. ఎందుకలా? అని అడిగితే "అలవాటయిపోయిందప్పా!" అన్నారాయన. కవర్గం లాగే, చ వర్గానికీ, త వర్గానికీ కూడా ఒక్క అక్షరమే మిగిలింది తమిళంలో. అందుకే గాంధీ నగరానికీ, కాంతీ నగరానికీ పెద్ద తేడా లేదు.



మన దేశంలోని వైవిధ్యం గురించి చెపుతూ పోతే, సముద్రమే అవుతుంది. అందులోనూ భాషల వైవిధ్యం మరింత లోతు, విశాలమయినది. ఆ లోతు సముద్రంలో నీరు ఇంకిపోతున్నదనీ, కొన్ని భాషలు మాయమవుతున్నాయనీ, మరి కొన్ని భాషలు బక్కబడుతున్నాయనీ, భాషా శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇదంతా కోకాకోలా కాలం. కాదంటే పెప్సీతో దాని యుద్ధం

కాలం. ఏ దిల్ మాంగే మోర్ అనే నాలుగు మాటలకు పెప్సీ అని అర్థం. హిందీ, ఇంగిలీషుల కలయిక ఈనాటి ట్రెండ్! మణిప్రవాళమని పాతకాలంలో ఒక పద్ధతి ఉండేది. తెలిసిన రెండు మూడు భాషలను 'కలిపి కొట్టరా కావేటిరంగా' పద్ధతిలో వాడడమే ఆ పద్ధతి. చేతికందిన పూసలతో మణులు, పగడాలు, మిగతావి కలగలిపి దండ గుచ్చడమని అర్థం! అది ఒకందుకు బాగానే ఉంది. కానీ ఈకాలపు కోలా ప్రవాహంలో కొట్టుకు పోయేవారికి, కలగలిపిన పదాలు ఏవి, ఏ భాషవో తెలిసినట్టు అనిపించదు. నో సోచింగ్, నో యోజిచ్చింగ్, నో ఆలోచించింగ్! అంటూ ఈ మధ్యన రెండు చక్రాల బండీ మీద ఒక భాష వచ్చి పేపర్లో దిగింది.

మార్పు రావడంలో తప్పు లేదు. అదేదో తెలిసి వస్తే బాగుంటుంది. ఉన్న భాషలు జావగారిపోయి. భిన్నభాషలు కలిసి ఒకటేదో కోలా భాష వస్తే ఎవరేం చేయగలరు. కంప్యూటర్ భాషల్లో జావా అని ఒకటి ఉంది. దాని పేరు ఉన్నచోటల్లా కప్పులో వేడి పానీయము ఒకటి కనబడుతుంది. అది మన తెలుగు జావనా? ఎవరు పెట్టారు ఆ పేరు?

ఉండే ఆరువేల భాషలు మరో వందేళ్లలో అంతమయ్యి, కొంత మిగిలి, కొన్ని వందలే అవుతాయని కొందరంటున్నారు. ఉండే ఆరు బిలియనుల (అటు యిటు) మానవులు, ఆరువేల భాషలను సమానంగా పంచుకు బతికితే, అన్ని భాషలూ బాగుండును. మన దేశంలో స్వంత భాష ఉన్నా లేకున్నా హిందీ, ఇంగిలీషుతోనే బతుకు తెల్లవారుతుంది. ఇంకా మనం మేలు. ఒకే భాషను పట్టుకుని వేలాడే కొన్ని దేశాలు మరింత అన్యాయం. ఇండొనీషియాలో ఎన్నో భాషలున్నా, స్వాతంత్ర్యం తర్వాత అందరూ కలిసి, బహాసా భాష(!)కు పట్టంగట్టారు. అదే రాజ్యమేలుతున్నది. మన హిందీకి ఆ గౌరవం కలుగక పోవచ్చు!



చైనా మాత్రం భాషల విషయంలో, సంస్కృతిలోని ఇతర అంశాల విషయంలో ప్రపంచదేశాలన్నింటికీ భిన్నంగా ఉంటుంది. వారి దేశంలో విభజనలు లేవు. ఏకీకరణ లేదు. చెప్పన్నారు దేశాల మన దేశంలో పరిస్థితికీ, మనకన్నా పెద్దదీ, ఎక్కువ జనాభా గలదీ అయిన చైనా పరిస్థితికి ఎంత తేడా. మందరిన్ అనే భాష అక్కడి వారందరికీ స్వంతం! పరిస్థితి పూర్తిగా అటు చివరన ఉండేది పసిఫిక్ లోని న్యూగినీ ప్రాంతపు దీవులు. ఉండేది ఎనభయి లక్షల మంది. భాషలు మాత్రం పదునాలుగు వందలు. ఒక్క న్యూగినీలోనే వెయ్యి భాషలున్నాయట!

వెయ్యి అంటే పది నూర్లనీ, నూరు పదులనీ అర్థం. వెయ్యి అంటే ఏదయినా వెయ్యమని అర్థం. ఈ అర్థాలు ఇలా ఇంకెంత కాలం నిలిచి ఉంటాయో?

**6 ఆగస్టు 2001**